ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:23 (శని)
సహరి : 4:44 (ఆది)

దేవదాయ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు సస్పెన్షన్

ఏలూరు కార్పొరేషన్, మార్చి 22 : ఏలూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.ఎల్.నరసింహారావుపై పోక్సో కేసు నమోదు కావడంతో దేవదాయశాఖ కాకినాడ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు అసిస్టెంట్ కమిషనర్ చెన్ను రంగారావు శుక్రవారం తెలిపారు. ఈనెల 20వ తేదీన కామవరపుకోట మండలంలోని ఓ గ్రామంలో ఆలయ హుండీ లెక్కింపు పర్యవేక్షణకు నరసింహారావు వెళ్లారు. ఆ సమయంలో మంచినీళ్లు తాగేందుకు దేవాలయం సమీపంలోని ఒక నివాసానికి వెళ్లారు. అక్కడ ఒంటరిగా ఉన్న ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడంతో ఆ బాలిక తన తల్లిదండ్రులకు విషయాన్ని తెలపగా వారు తడికలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జయబాబు నరసింహారావుపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో నరసింహారావును విధుల నుంచి సస్పెండ్‌చేస్తూ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు ఆదేశాలు జారీ చేశారు. కాగా నరసింహారావు స్థానంలో తాడేపల్లిగూడెంకు చెందిన దేవాలయ ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించగా ఆయన శుక్రవారం ఏసీ రంగారావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

'పది' పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు

ఏలూరు ఎడ్యుకేషన్/ముదినేపల్లి, మార్చి 22 : పదో తరగతి పరీక్షల్లో తొలి మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైంది. శుక్రవారం గణితం పరీక్ష జరగ్గా ముదినేపల్లిలోని సహాయమాత ఇంగ్లీషు మీడియం స్కూలు పరీక్ష కేంద్రంలో రాస్తున్న ఓ ప్రైవేట్ విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా తనిఖీ బృందాలు పట్టుకుని కేసు నమోదు చేసినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు నుంచి వచ్చిన ఎంఈవో రంగయ్య ఆధ్వర్యంలోని తనిఖీ బృందం అధికారులు పరీక్ష హాలులో చెక్ చేస్తున్న సందర్భంగా కాపీయింగ్ పాల్పడుతూ ఆ విద్యార్థి దొరికిపోయాడు. అంతకు ముందు ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కూడ స్పెషల్ స్క్వాడ్ బృందం ఎక్కువ సేపు తనిఖీలు నిర్వహించింది. కాగా గణితం పరీక్షకు జిల్లాలో రెగ్యులర్ విభాగంలో 24,133 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకోగా 23,451 మంది, ప్రైవేటు విభాగంలో 5,781 మంది విద్యార్థులకు 3,682 మంది హాజరయ్యారని వివరించారు. మొత్తం 63 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశామన్నారు.

'ఓపెన్' పరీక్షలు ప్రశాంతం

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్యావిధానంలో శుక్రవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు జిల్లాలో 971మంది అభ్యాసకులు దరఖాస్తుచేసుకోగా 833 మంది, ఇంటర్మీడియట్‌లో గణితం పరీక్షకు 444 మందికి 399 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

పోలీస్ సంక్షేమ దివస్

ఏలూరు క్రైం, మార్చి 22 : విధులలో పోలీస్ సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారి సమస్యలను తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చేయడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సంక్షేమ దివస్ (గ్రీవెన్స్ డే) ను నిర్వహించారు. పోలీస్ శాఖలోని సిబ్బంది, హోంగార్డులు, ఏఆర్ సిబ్బంది సమస్యలను వినతుల రూపంలో ఎస్పీ స్వీకరించారు. వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ పోలీసు సంక్షేమ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుల్ నుంచి పదోన్నతి పొంది హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పెయ్యల విజయకుమార్, కూరెళ్ళ కృష్ణంరాజు, బోడావుల నాగ శ్రీను, ఉలిపి శ్రీనివాస్ పూలమొక్కను ఎస్పీకి అందించి కృతజ్ఞతలు తెలిపారు.

ఏలూరు మహేష్ కుమార్‌కే..

ఎంపీ అభ్యర్థిని ఖరారు చేసిన టీడీపీ





ఏలూరు లోక్‌సభ స్థానం టీడీపీ అభ్యర్థిగా పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను ప్రకటించారు. చాలా కాలం నుంచి ఈ స్థానంపై ఒకవైపు టీడీపీ మరోవైపు బీజేపీ మధ్య దోబూచులాట సాగింది. వీటికి తెర దించుతూ మహేష్ కుమార్‌ను తన అభ్యర్థిగా టీడీపీ ప్రకటించింది. మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడుకు మహేష్ కుమార్ యాదవ్ స్వయానా అల్లుడు. ఈ నేపథ్యం ఆయనకు బాగా కలిసి వచ్చింది. గతంలో ఒక సామాజిక వర్గం నుంచే దశాబ్దాల తరబడి పోటీ జరుగుతున్నా ఈ సారి మాత్రం బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలనే క్రమంలో ఏలూరు లోక్‌సభ స్థానాన్ని వారికి కేటాయిస్తూ శుక్రవారం టీడీపీ కీలక నిర్ణయం తీసుకుంది.

- ఇప్పటివరకు ఉన్న చిక్కుముడి వీడింది
- ఇంకోసారి ఆలోచించండి అంటున్న బీజేపీ
- ఇస్తామంటూనే.. గోపాల్‌యాదవ్ ఆవేదన
- ఇక తేలాల్సింది నరసాపురమే

(ఏలూరు - ఆంధ్రజ్యోతి, ప్రతినిధి)

ఏలూరు ఎంపీ స్థానానికి అభ్యర్థిగా ఎంపికైన మహేష్‌కుమార్ వ్యాపారవేత్త, కడప జిల్లా మైదుకూరు ఆయన స్వగ్రామం. టీటీడీ మాజీ ఛైర్మన్ పుట్టా సుధాకర్ తనయుడు కూడా. బీసీ వర్గాల్లో యాదవులకు తగినంత ప్రాధాన్యత ఇచ్చే దిశగానే తెలుగుదేశం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నూజివీడు అసెంబ్లీ స్థానం నుంచి కొలుసు పార్థసారథి కూడా యాదవ సామాజిక వర్గానికి చెందిన వారే. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఎంపీ స్థానంతో పాటు ఒక అసెంబ్లీ స్థానం టీడీపీ యాదవులకే కేటాయించినట్టు అయింది. మరోవైపు బీసీ సామాజిక వర్గాలు ఈ నిర్ణయాన్ని దాదాపు స్వాగతించాయి. కొన్నాళ్లుగా మహేష్‌కుమార్ యాదవ్‌తో పాటు బీసీ వర్గాలకే చెందిన సత్య నారాయణ గౌడ్, గోరుముచ్చు గోపాల్ యాద వ్ సైతం పోటీ పడినా చివరికి మహేష్ వైపే టీడీపీ మొగ్గు చూపింది. మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు కుటుంబానికి చెందిన వారికి ఎన్నిసీట్లు ఇస్తారంటూ కొంతమేర పార్టీలో గుసగుసలు వినిపించినా బీసీల మద్దతుతో మహేష్ గట్టు ఎక్కడం ఖాయమని ఆ పార్టీ వర్గాలు గట్టి నమ్మకంతో ఉన్నాయి. దెందులూరు, నూజివీడు, కైకలూరు, ఏలూరు నియోజక వర్గాల్లో యాదవ్ సామాజిక వర్గానికి చెందిన ఓటర్ల సంఖ్య గణనీయంగానే ఉంది. వీరందరి మద్దతు కూడకట్టుకోవడమే కాకుండా ఇంకోవైపు యనమదల రామకృష్ణుడు ఇమేజ్ ఉభయగోదావరి జిల్లాల్లో ఉండడంతో ఆయనకు కొంత కలిసి వస్తుందంటున్నారు. ఈ మేరకు టీడీపీ అధినాయకత్వం పలుమార్లు వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరించి ఆ మేరకే తుదినిర్ణయం తీసుకుంది. వాస్తవానికి ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయటానికి ఒకవైపు మహేష్‌కుమార్ యాదవ్‌తో పాటు పోలీస్ ఐజీ సత్యనారాయణగౌడ్ సైతం పోటీ పడ్డారు.

వారి విజ్ఞతకే వదిలేస్తున్నా : గోపాల్‌యాదవ్



చాలాకాలం నుంచి ఏలూరు ఎంపీ టిక్కెట్ రేసులో ఉన్న గోరుముచ్చు గోపాల్‌యాదవ్ తనకు అవకాశం దక్కకపోవడంతో శుక్రవారం ఒక వీడియోను విడుదల చేశారు. ఇన్నాళ్లు తనకు ఇస్తానంటూనే ఎక్కడో మైదుకూరులో ఉన్న వ్యక్తికి టిక్కెట్ ఇచ్చారని, దీనికి టీడీపీ విజ్ఞతకే వదిలేస్తున్నానని గోపాల్ యాదవ్ పేర్కొన్నారు. ఇంకోవైపు బీసీలకు ఎంపీ స్థానాల్లో మెరుగైన అవకాశాలు ఇచ్చినా జగన్‌కు ఫ్యాన్ అయిపోయానని ఆయన ధైర్యాన్ని మెచ్చుకుంటున్నానంటూ వ్యాఖ్యలు చేశారు. నెలక్రితం తన భార్య ప్రాణాపాయంతో ఆస్పత్రిలో చేరినప్పుడు తాను రెండురోజుల పాటు సింగపూర్‌లో ఉండాల్సి వచ్చిందని ఈ సమయంలో తన వ్యతిరేక శక్తులు బాగా పనిచేశాయంటూ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలం పాటు ఏలూరు సీటుకోసం ప్రయత్నించడమే కాకుండా వివిధ కార్యక్రమాల్లో యాదవ్ పాలు పంచుకుంటూ వచ్చారు. చివరి క్షణం వరకు టిక్కెట్ తనదేనంటూ దీమాతో ఉన్నారు. కాని తెలుగుదేశం అధిష్ఠానం మహేష్ కుమార్ వైపు మొగ్గు చూపడంతో గోపాల్ యాదవ్ అనుచరులు ఖంగుతిన్నారు. రెండురోజుల్లోనే యాదవ్ తగు నిర్ణయానికి సిద్ధమవుతున్నట్టు చెబుతున్నారు.

నరసాపురంలో ఏమైంది..?

నరసాపురం లోక్‌సభ స్థానాన్ని, ఇంతకు ముందే ఉమ్మడి పొత్తులో భాగంగా భారతీయ జనతా పార్టీకి కేటాయించారు. ఈ స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తారనే దానిపై ఇప్పటికే సందిగ్ధత వీడలేదు. వైసీపీకి రాజీనామా చేసినా సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు ఈ స్థానంలో తిరిగి పోటీ చేస్తారని ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో కూటమిలో భాగస్వాములైన కార్యకర్తలంతా విశ్వసిస్తున్నారు. బీజేపీ సైతం నరసాపురం లోక్‌సభ, కైకలూరు అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులపై గడిచిన రెండు రోజులుగా ఢిల్లీస్థాయిలో కమలనాథులు కసరత్తు చేస్తున్నారు. వీలైతే శనివారం పార్లమెంటరీ బోర్డు మరోసారి సమావేశమై ఏపీలో ఎంపీస్థానాలు, అసెంబ్లీ స్థానాలపై ఒక క్లారిటీ ఇవ్వగలరని భావిస్తున్నారు. రఘు రామకృష్ణంరాజు అనుకూలురు మాత్రం ఇప్పటికే భారీ ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. రఘు రామకృష్ణంరాజు సైతం తాను పోటీచేసేది నరసాపురం నుంచేనని క్లారిటీ ఇచ్చారు.

చిక్కుముడి వీడినా..

ఏలూరు లోక్‌సభ స్థానం ఎవరికి కేటాయిస్తారనే దానిపై కూటమిలో నిన్న, మొన్నటి వరకు ఉత్కంఠ కొనసాగింది. బీజేపీ సైతం మార్పులు, చేర్పులు జరిగి తమకే ఈ సీటు కేటాయిస్తారంటూ దీమా వ్యక్తం చేయటమే కాకుండా ప్రత్యేకించి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనా చౌదరి పోటీ చేయడం ఖాయమని, పదేపదే ప్రకటిస్తూ వచ్చారు. కాని వీరి ఆశలను నీరుగారుస్తూ తెలుగుదేశం తన అభ్యర్థిగా మహేష్‌కుమార్ యాదవ్‌ను ప్రకటించి ఇప్పటివరకు ఉన్న చిక్కుముడులను విప్పింది. తెలుగుదేశం అభ్యర్థి ప్రకటన వెలువడిన కడప నేత వద్దు స్థానిక నేత గారపాటికే సీటు అని బీజేపీ నేతలు ఏలూరు బీజేపీ కార్యా లయంలో నినాదాలతో హోరెత్తించారు. మూడు పార్టీలు ఏలూరు పార్లమెంట్ సీటు విషయంలో పునరాలోచన చేయాలంటూ డిమాండ్ చేశారు. ప్రత్యేకించి 16 ఏళ్లుగా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న తపనా చౌదరికి అవకాశం ఇవ్వాలని ఆయనకు అన్ని పార్టీల మద్దతుతో పాటు ప్రజామద్దతు ఉందని, ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గాది రాంబాబుతో సహా, వరప్రసాద్, గుమ్మడి చైతన్య, రామ్‌ప్రసాద్, నాగసురేష్, శ్రీనివాసశాస్త్రి, శివతో సహా నేతలందరూ డిమాండ్ చేశారు. పాత్రికేయుల ముందు తమ వాదనలు వినిపించే ప్రయత్నం చేశారు. టినరసాపురం మండలం తిరుమలదేవీపేటలోను మండల బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. పొత్తులో భాగంగా బీజేపీకే ఏలూరు పార్లమెంటు సీటును కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్ల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి పీవీఎస్ఎస్ రామలింగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి చాత్రాతి యుగంధర్, సోషల్ మీడియా సెక్రెటరీ చిక్కుళ్ళ వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు హరిబాబు తదితరులు పాల్గొన్నారు. అయితే ఇప్పటికే తెలుగుదేశం కీలక నిర్ణయం ప్రకటించినందున తిరిగి మరోసారి నిర్ణయం పునఃసమీక్ష ఉంటుందా? ఉండదా? అనేదే అందరిలోనూ ప్రశ్న.



ఏలూరు బీజేపీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న బీజేపీ శ్రేణులు



ఎమ్మెల్యే నానితో పాటు లక్ష్మీనారాయణ (సర్కిల్లో)

వైసీపీ కార్యకర్తలా ఉద్యోగి

ఏలూరు రూరల్, మార్చి 22 : కొందరు ఉద్యోగులు వైసీపీ కార్యకర్తల్లా పనిచేయడం వివాదస్పదంగా మారుతోంది. ఓ ఉద్యోగి సాక్షాత్తు ఒక గ్రామం నుంచి మహిళలను తీసుకెళ్లి ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని చేత పార్టీ కండువా కప్పించిన ఘటనపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక కొత్త బస్టాండు వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో తెర్లి లక్ష్మీ నారాయణ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతను వైసీపీకి వీరవిధేయుడిగా పనిచేస్తూ రెండురోజుల క్రితం పోణంగికి చెందిన కొంతమంది మహిళలను స్వయంగా తీసుకెళ్లి ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో పార్టీలో చేర్పించాడు.

ముగ్గురు వలంటీర్ల తొలగింపు

ఉంగుటూరు/కొయ్యలగూడెం : ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన ముగ్గురు వలంటీర్లను విధుల నుంచి అధికారులు తప్పించారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఎన్నికల ప్రచారంలో వలంటీర్ పాల్గొన్న వార్తకు అధికారులు స్పందించారు. దీంతో వలంటీర్‌గా పని చేస్తున్న పైడి అరుణ్ కుమార్ (ప్రస్తుత వైసీపీ గ్రామ అధ్యక్షుడు)ను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కొయ్యలగూడెం మండలం పరింపూడిలో నిబంధనలు ఉల్లంఘించిన వలంటీర్లు టి.రజని, పి.ప్రమీలను విధుల నుంచి తొలగించిటు్ట ఎంపీడీవో అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు.

వెంకటాపురంలో బ్రాందీషాపు సూపర్‌వైజర్..

కలిదిండి : వెంకటాపురంలో బ్రాందీ షాపు సూపర్‌వైజర్ పేరం నాగబాబు ఈనెల 19న ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్టు గ్రామస్థులు ఫిర్యాదు చేయగా, నిర్ధారణ కావడంతో విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో దినతేజ్ తెలిపారు.

ఎంసీసీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలి : కలెక్టర్

ఏలూరు సిటీ, మార్చి 22 : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఎటువంటి ఉల్లంఘనలకు తావులేకుండా ఉండాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జేసీ లావణ్యవేణితో కలిసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి , సి-విజిల్, కంట్రోల్ రూమ్ నిర్వహణ, ప్రతికూల వార్తలపై చర్యలు తదితర అంశాలుపై రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తదుపరి జిల్లాలో అమలు అవుతున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి సందర్భంగా తీసుకోవాల్సిన తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఎంసిసి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సి-విజిల్ ద్వారా ఫిర్యాదు చేసిన వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని వారు చేసిన ఫిర్యాదులను పరిశీలించి విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద ఎస్ఎస్‌టి టీమ్ లు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. వివిధ రాజకీయ, ప్రచార కార్యక్రమాల అనుమతులు నిమిత్తం సువిధా యాప్, ఎన్ కోర్ ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి నిర్దిష్ట కాలంలో అనుమతులు జారీ చేయాలన్నారు. ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, డీఆర్వో డి.పుష్పమణి, అయా నియోజకవర్గాల ఆర్వోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

26లోగా పెండింగ్ ఫారాల పరిష్కారం

పెండిగ్‌లో ఉన్న ఫారం-7,8లను ఈనెల 26వ తేదీ నాటికి పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు పరిచే అంశానికి సంబంధించి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ , జేసీ లావణ్యవేణి, డీఆర్వో పుష్పమణి, ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, తదితరులు హాజరయ్యారు.



ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ విధానంపై సమీక్షిస్తున్న కలెక్టర్, అధికారులు

ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వినియోగాన్ని విస్తృతపరచండి

ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వినియోగాన్ని మరింత విస్తృత స్థాయిలో మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలతో ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ విధానంపై ఎస్పీ మేరీప్రశాంతితో కలిసి ఆయన సమీక్షించారు. మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపెట్టే మద్యం, నగదు, ఇతర గిఫ్టు వంటి పంపిణీని పూర్తిగా నిరోధించేందుకు రాత్రిపూట గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. జిల్లా సరిహద్దులు, చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్‌ల తనిఖీలు మరింత పెరగాలన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థులు ఇంటింటి ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాల్లో మద్యం, నగదు పూర్తిస్థాయిలో అరికట్టేలా చర్యలు తీసుకున్నామన్నారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని 50వేల రూపాయల పైన నగదు ఉంటే అందుకు సంబంధించిన పత్రాలను పరిశీలించిన పిదప తగు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమానికి వినియోగించే వాహనాలకు సంబంధించి అనుమతుల్లో వాహనం నెంబర్, కేటాయించిన సమయం తదితర వివరాలను అందించాలన్నారు. డీఆర్వో పుష్పమణి, సెబ్ జాయింట్ డైరక్టర్ ఎన్.సూర్యచంద్రరావు, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు , డీఎఫ్‌వో శైలజ, జిల్లా ఖజానా అధికారి టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు : డీఈవో

ఏలూరు ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ పట్టికలోని ముఖ్యమంత్రి, రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించినట్టు డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఖచ్చితంగా అమలుచేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించామన్నారు. ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరిగితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు.



ఉంగుటూరు నియోజకవర్గ సెక్టార్ అధికారులు

ఏలూరు సిటీ, మార్చి 22 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలోని ఉంగుటూరు నియోజక వర్గానికి 25 మంది సెక్టార్ అధికారులను నియమించారు.

సెక్టార్ అధికారి అండ్ హోదా	మొబైల్ నెంబరు	పోలింగ్ కేంద్రాల నెంబర్లు
1. కె.శ్రీనివాసరావు, ఎంఈవో, ఉంగుటూరు	8341429488	27,28,29,30,31,32,33,34,35,36,
2. పి.సాయిబాబు, హెచ్‌ఎం, జడ్పీహెచ్ఎస్, గొల్లగూడెం	9989322461	37,38,40,41,42,43,39,26,
3. కె.రామారావు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉంగుటూరు	9492207758	48,46,47,57,60,58,59,55,56,
4.సీహెచ్ సురేష్‌బాబు, ఏఈ, హౌసింగ్, ఉంగుటూరు	9441965347	49,50,51,52,53,54,12,13,
5. షేక్ షంషుద్దీన్, ఈవోపీఆర్డీ, ఉంగుటూరు	9912517973	61,62,63,64,65,66,67,08,09,10,11,
6. కె.మంగారావు, ఎఫ్‌డీవో, ఉంగుటూరు	9701977802	01,02,03,04,05,06,07,
7. బి.వెంకటేష్, ఎంఏవో, వ్యవసాయ శాఖ, ఉంగుటూరు	8886612958	18,17,16,19,14,15,
8. ఎంవీపీ పెద్దిరాజు, ఏఈ(ఇరిగేషన్), తాడేపల్లిగూడెం	9666282313	20,21,22,23,24,25,44,45,
9. ఈ.శ్రీనివాసరావు, ఎంఈవో-1, భీమడోలు	9703442333	68,69,70,71,72,73,74,75,76,77,78,79,
10. ఎస్‌వీపీ ఉషారాణి, ఏంఏఓ, వ్యవసాయ శాఖ, భీమడోలు	8331056680	80,81,82,83,84,85,97,98,99
11. పి.ఉషారాజకుమారి, ఏడీ, వ్యవసాయశాఖ, భీమడోలు	8331056642	86,87,88,89,90,91,92,93,94,95,96,
12. ఎ.సుందరి, ఈవో పీఆర్డీ, భీమడోలు	8328627683	100,101,102,103,104,105,106,107,108,109,110,112,
13. ఏవీఎస్ఎన్ భాస్కరకుమార్, ఎంఈవో-2, భీమడోలు	9491724072	111,113,114,115,116,117,118,119,120,
14. వి.చంద్రశేఖర్, ఈఓ పిఆర్‌అండ్‌ఆర్‌డి, నిడమర్రు	8466951338	121,122,123,124,125,126,127,179,
15. కె.ప్రవీణ్‌కుమార్, ఏఈ, పిఆర్, నిడమర్రు	9110723267	185,186,187,188,189,128,129,130,131,132,133,134,
16. పి.సుబ్రహ్మణ్యం, ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్, నిడమర్రు	9866645570	174,175,176,177,178,180,181,182,183,184,
17. కె.రాంబాబు, ఎంఈఓ, నిడమర్రు	8500711740	190,191,192,193,194,195,196,197,
18. ఆర్.రవికుమార్, హెచ్‌ఎం, జడ్పీహెచ్ఎస్, కేశవరం	9908259513	203,139,136,137,138,204,205,206,140,
19. పీజేవెంకటేశ్వర్లు, హెచ్‌ఎం, జడ్పీహెచ్ఎస్, పిప్పర	9441963572	143,144,145,146,141,142,
20. ఏఎస్ఎస్‌బీఆర్ ప్రసాద్, హెచ్‌ఎం, జడ్పీహెచ్ఎస్, కాశిపాడు	8008594859	162,161,211,212,207,214,
21. వీవీ సత్యనారాయణ, ఈవోపీఆర్డీ , గణపవరం	9885126408	153,154,155,156,157,158,159,
22. పి.శేషు, ఎంఈవో-1, గణపవరం	9441073533	147,148,149,150,151,152,
23. జి.బాలయ్య, ఎంఈఓ-2, గణపవరం	9640502355	160,208,209,210,213,
24. ఎంవిఎస్ నారాయణమూర్తి, హెచ్‌ఎం, జడ్పీహెచ్ఎస్(బాలురు),గణపవరం,	7995670033	198,199,200,201,202,170,171,172,173,
25. వైవీఎస్ ప్రసాద్, ఎంఏవో, వ్యవసాయశాఖ, గణపవరం	8331056685	163,164,165,166,167,168,169,135



కల్యాణ వేదికపై జలదుర్గ, గోకర్ణేశ్వరస్వామి

కన్నుల పండువగా జలదుర్గ గోకర్ణేశ్వరస్వామి కల్యాణం

కైకలూరు, మార్చి 22 : కొల్లేటికోట పెద్దింటమ్మ కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా భక్తుల కోలాహలం మధ్య వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. గురువారం రాత్రి గోకర్ణపురం నుంచి గోకర్ణేశ్వరస్వామిని పల్లకీపై ఊరేగింపుగా పెద్దింటమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత జలదుర్గా అమ్మవారికి గోకర్ణేశ్వర స్వామికి వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. వేలాదిమంది భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. శుక్రవారం అమ్మవారికి నవవరణార్చన, కలశపూజ, జయాధి హోమం, బలిహరణ, పుష్పాలం కరణ, ధూపసేవ, బాలభోగం, హారతి, మంత్రపుష్పం, పంచ హారతులు నిర్వహించారు. అమ్మవారికి పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, భక్తులకు ఉచిత ప్రసాదాన్ని ఐ.భీమ వరానికి చెందిన గొట్టుముక్కల వెంకట సూర్యనారాయణరాజు, సుబ్బలక్ష్మి దంపతులు అందజేశారు. ఈవో కేవీ గోపాలరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు.



జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఏపీ జట్టు కెప్టెన్‌గా తోలేరు యువకుడు


సీతారామ తేజ

వీరవాసరం, మార్చి 22 : మహారాష్ట్రలో జరుగుతున్న 70వ జాతీయ సీనియర్ కబడ్డీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్‌గా తోలేరు యువకుడు సారథ్యం వహిస్తున్నాడు. పురుషుల కబడ్డీ జట్టుకు వీరవాసరం మండలం తోలేరు గ్రామ యువకుడు తోట కుమార సీతారామతేజ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. సీఐఎస్ఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సీతారామతేజ కెప్టెన్‌గా ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తేజ హైస్కూల్ స్థాయిలోనూ కబడ్డీపై మక్కువ చూపాడు. క్రీడల్లో ఉన్న ఆసక్తి కొద్ది కబడ్డీపై ఉత్సాహం చూపుతున్న తరుణంలో తోలేరు పీఈటీ పీఎస్ఎన్ మల్లేశ్వరరావు కబడ్డీలో మెలకువలపై తర్ఫీదు ఇచ్చారు. అండర్-17, అండర్-19 , కబడ్డీలో జాతీయస్థాయిలో ప్రతిభ చూపారు. తెలంగాణలో నిర్వహించిన ప్రొకబడ్డీలో రెండు సీజన్లలోనూ ప్రతిభ చూపారు. సీనియర్ నేషనల్స్‌లో రెండు పర్యాయాలు పాల్గొనగా రెండో పర్యాయం ఏపీ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికై సారథ్యం వహిస్తున్నాడు.

భవిష్యత్‌లో విద్యుత్ వాహనాలదే హవా


సందీప్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 22 : భవిష్యత్‌లో విద్యుత్ వాహనాలదే హవా అని ప్రిన్సిపాల్ ఇంజనీర్ లైట్ ఆన్ (సింగపూర్) డాక్టర్ మడిశెట్టి సందీప్ తెలిపారు. ఏపీ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం, డీఎస్ఐఆర్, సీఆర్ టీడీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో 'విద్యుత్ వాహనాల పురోగతిలో సవాళ్ళు భవిష్యత్' అనే అంశంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాదిపతి డాక్టర్ టి.రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సందీప్ మాట్లాడుతూ పెట్రోల్ ధరలు పెరిగిపోవడంతో వాహనదారులు విద్యుత్‌వాహనాల కొనుగోలుపై మక్కువ చూపిస్తున్నారన్నారు. వాహనాల బ్యాటరీ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఎటువంటి లోపాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సందీప్‌ను ఆచార్యులు సత్కరించారు. రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ శ్రీఫణికృష్ణ, అడహక్ ఫ్యాకల్టీ డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ మూర్తి, డాక్టర్ మురళి, డాక్టర్ అమృత్‌రాజు, డాక్టర్ కళ్యాణచక్రవర్తి, డాక్టర్ పవన్ పాల్గొన్నారు.

28 నుంచి బాస్కెట్ బాల్ పోటీలు


క్రీడా పోటీల వివరాలు వెల్లడిస్తున్న స్పోర్టింగ్ క్లబ్ సభ్యులు

నూజివీడు టౌన్, మార్చి 22: బొబ్బిలి కొండలరావు మెమోరియల్ క్రీడా పోటీలను ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్నట్టు స్పోర్టింగ్ క్లబ్ సభ్యుడు టీవీ కృష్ణారావు తెలిపారు. స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నూజివీడు డీఏఆర్ కళాశాలలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు బొబ్బిలి కొండలరావు మెమోరియల్ జాతీయ స్థాయి ఆహ్వాన బాస్కెట్ బాల్ పోటీలు లీగ్ అండ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నూజివీడు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్లు రామిశెట్టి మురళి, పగడాల సత్యనారాయణ, ఇతర సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పశ్చిమ'లో టెన్త్ పరీక్ష ప్రశాంతం

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 22 : పదో తరగతి గణితశాస్త్ర పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 127 పరీక్ష కేంద్రాల్లో 21,527 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 20,734 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 793 మంది గైర్హాజరయ్యారు. ఎస్ఎస్‌సీ (ఏపీఓఎస్ఎస్) పరీక్ష 830 మందికి 729 మంది, ఇంటర్మీడియట్ (ఏపీఓఎస్ఎస్) పరీక్షకు 810 మందికి 738 మంది హాజరయ్యారు. ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని డీఈవో వెంకటరమణ తెలిపారు.

'పది' పరీక్ష కేంద్రంలో నిబంధనలు నిల్ !

పెనుగొండ, మార్చి 22 : పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద అధికారులు నిబంధనలకు నీళ్ల వదిలారు. ఈక్రమంలో మాస్ కాపీయింగ్ అంటూ విస్తృత ప్రచారానికి దారితీసిన ఘటన పెనుగొండలో జరిగింది. వివరాలిలా.. పెనుగొండ చైతన్య స్కూలులో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రంలో శుక్రవారం లెక్కలు పరీక్ష జరిగింది. ఉదయం పదో తరగతి, మధ్యాహ్నం చైతన్య స్కూలు విద్యార్థులకు రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం పరీక్ష పూర్తయితే గాని కేంద్రంలోకి ఇతరులు ఎవరూ ప్రవేశించకూడదు. దీనికి విరుద్ధంగా పాఠశాల సిబ్బంది పరీక్ష జరుగుతుండగానే స్కూలులోకి ప్రవేశించారు. ఈ క్రమంలో మాస్ కాపీయింగ్ జరుగుతుందంటూ ప్రచారం జరిగి మీడియా చేరడంతో అధికారులు హుటాహుటిని సిబ్బందిని బయటకు పంపించారు. చైతన్య పాఠశాలలో నిబంధనలు పాటించకపోవడం వంటి ఆరోపణలపై విచారించి చర్యలు తీసుకుంటామని ఎంఈవో సుభాకరరరావు తెలిపారు.

పట్టపగలు చోరీ



కైకలూరు, మార్చి 22: తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీ అయిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు కైకలూరు రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామానికి చెందిన దాట్ల ప్రభావతి అదే గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తోంది. గురువారం రోజువారీమాదిరిగా ఇంటికి తాళం వేసి స్కూల్‌కు వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. చోరీ అయినట్టు గుర్తించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వచ్చి పరిశీలించి బీరువాలోని ఏడు కాసుల బంగారు ఆభరణాలు చోరీ అయినట్టు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కృష్ణాపురం చెరువులో మట్టి తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

ద్వారకాతిరుమల, మార్చి 22 : అడ్డగోలుగా మట్టిని కొల్లగొట్టి జేబులు నింపుకోవడమే పనిగా కొంతమంది వైసీపీ నాయకులు తవ్వకాలు జరుపుతున్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులు ఆ వైపు దృష్టి సారించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మండలంలోని పంగిడిగూడెం పంచాయతీ సూర్యచంద్రరావుపేట శివారు కృష్ణాపురం చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గ్రామాల్లోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఈ మట్టిని దూరాన్ని బట్టి రూ.500 నుంచి వెయ్యి రూపాయలకు విక్రయిస్తూ రాత్రి పగలు తేడా లేకుండా సంపాదనే ధ్యేయంగా కార్యక్రమాలు సాగిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.


చెరువులో మట్టి తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్



22-03-2024 పొగాకు ధరలు (రూ.) పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	240	238	239.91
జంగారెడ్డిగూడెం-1	240	235	239.50
జంగారెడ్డిగూడెం-2	240	235	239.46
కొయ్యలగూడెం	240	236	239.95
గోపాలపురం	241	235	239.62

తొలగిన బొమ్మలు, రంగులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చి ఆరు రోజులైంది. కోడ్ అమలు చేయాల్సిన అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కొన్ని చోట్ల అధికారులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ మరికొన్ని చోట్ల నిబంధనలు అమలు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి పూర్తిస్థాయిలో ఎన్నికలు నిబంధనలు అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.


టీనరసాపురంలో జగన్ స్టిక్కర్లపై కాగితాలు అంటించిన దృశ్యం


కైకరం వద్ద హైవేలో చెట్లకు రంగులు మార్చిన అధికారులు

టి.నరసాపురం, మార్చి 22 : 'విద్యుత్ మీటర్లపైనా జగన్ బొమ్మ' అనే శీర్షికన ఈనెల 21వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై విద్యుత్ శాఖ స్పందించింది. మండలంలో దాదాపు 4,500 ఉచిత విద్యుత్ మీటర్లపై సీఎం జగన్ ఫొటోతో పాటు నవరత్నాల పథకాలను ప్రదర్శించే స్టిక్కర్‌లను పెట్టడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘిం చినట్టేనని ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించడంతో విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు స్పందించారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ఆ స్టిక్కర్‌లు కనిపించకుండా పేపర్‌లను అంటించే చర్యలు తీసుకున్నారు.

కైకరంలో చెట్ల రంగులు మార్చిన అధికారులు

ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో ఎన్నికల నిబంధనల అమలులో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'అధికారులకు కనిపించని అధికార పార్టీ బోర్డులు' శీర్షిక పేరుతో ప్రచురితమైన హైవే పక్కన బస్సు యాత్ర సందర్భంగా వేసిన రంగులను శుక్రవా రం ఉదయం ఈవోపీఆర్‌డీ షేక్ షంషుద్దీన్, కార్యదర్శి నాగేంద్ర స్పందించి వైసీపీ రంగులను తొలగించి వాటి స్థానే పింక్ రంగు వేశారు.

సాగునీరు అందిస్తాం

» స్పందించిన అధికారులు
» రైతుల హర్షం


మోగల్లులో పొలాలు పరిశీలిస్తున్న ఏవో నారాయణరావు

పాలకోడేరు: పొలాలకు సాగునీరు అందక రైతులకు కంటి మీద కునుకు కరువైంది.. అని శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. మోగల్లు గ్రామంలో దక్షిణ కాల్వను ఆనుకుని ఉన్న పంట పొలాలను సాగునీరు అందకపోవడంతో చేలు బీళ్లుగా మారాయని సాగునీరు కోసం రైతులు ఎదురు చూస్తున్నారని ప్రచురితం కావడంతో అధికారులు వెంటనే స్పందించి పొలాలను పరిశీలించారు. తక్షణమే నీరు అందించేలా ఇరిగేషన్ శాఖ అధికారులతో వ్యవసాయశాఖ అధికారులు రైతుల వద్ద నుంచే మాట్లాడారు. దక్షిణ కాల్వకు ఆనుకుని వున్న పంట పొలాలకు సాగునీరు పుష్కలంగా అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పొలాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఏవో నారాయణరావు తెలిపారు.

వాటర్ ట్యాంకుల మాటేంటి ?



నారాయణపురం, అక్కుపల్లిగోకవరంలో వైసీపీ రంగుల్లో మంచినీటి పథకాలు

ఉంగుటూరు, మార్చి 22 : మండలంలోని నారాయణపురం, అక్కుపల్లిగోకవరంలోని రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులకు వైసీపీ రంగులు వేయడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ నిబంధనల మేరకు రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులకు రంగులు నిర్ణయించి వేసేవారు. ప్రస్తుతం రాజకీయ రంగులుగా అధికార పార్టీ వారి కోరిక ప్రకారం రక్షిత మంచినీటి పథకాలకు రంగులు వేయడంతో పలువురు ఆవేదన చెందుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏవిధంగా స్పందిస్తారోనని వేచి చూస్తున్నారు.

వీటికి కోడ్ వర్తించదా ?

ఇరగవరం, మార్చి 22 : ఎన్నికల కోడ్ ఇంకా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ ప్రచార యావతో దొరికిన చోటల్లా వైసీపీ రంగులు వేసి వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. కరెంటు స్తంభాల నుంచి విద్యార్థులకు అందించే చిక్కీల కవర్ల దాకా దేనినీ వదలకుండా జగన్ ఫొటోలు, ఆ పార్టీ రంగులతో నింపేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా కొన్ని చోట్ల సిబ్బంది, అధికారుల అలసత్వంతో శిలాఫలకాలు, సంపద తయారీ కేంద్రాలు, వాటర్ ట్యాంకులు, చెత్తను సేకరణ వాహనాలపై పార్టీ రంగులు తొలగించకపోవడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.


చెత్తను తరలించే ప్రభుత్వ వాహనం


రాపాకలో సంపద తయారీ కేంద్రం

ఆశ్రమ విద్యార్థినికి అనారోగ్యం

» సిబ్బంది చర్యలపై తల్లిదండ్రుల అసంతృప్తి
» వైద్య పరీక్షలు జరిపి మందులు ఇస్తున్నామంటున్న ఏటీడబ్ల్యూవో శ్రీవిద్య


బుట్టాయగూడెం సీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న విద్యార్థిని వైశాలి

బుట్టాయగూడెం, మార్చి 22 : కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న గోరం డమరిక వైశాలి అనే విద్యార్థిని అనారోగ్యం భారినపడింది. శుక్రవారం విద్యార్థిని తల్లిదండ్రులు బుట్టాయగూడెం సీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం చేయించారు. బాలికను పరీక్షించిన వైద్యులు శనివారం మళ్లీ ఆసుపత్రికి తీసుకువస్తే రక్తపరీక్షలు చేసి మందులు ఇస్తామని తెలపడంతో తల్లిదండ్రులు లక్ష్మణ్, శాంతి బైక్‌పై స్వగ్రామం మర్రిగూడెం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతిగృహంలో ఉంటున్న పిల్లల ఆరోగ్యాల పట్ల సిబ్బంది తీసుకుంటున్న చర్యలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పాపకు నెలలో మూడు పర్యాయాలు జర్వం వచ్చినట్టు ఫోన్ చేసిందని గురువారం మళ్లీ ఫోన్ చేయడంతో వసతిగృహానికి వచ్చి ఇంటికి పంపించాలని అడిగామని, రాత్రిపూట పంపేది లేదని శుక్రవారం పంపుతా మని చెప్పడంతో.. జ్వరంతో బాధపడుతున్న పాపను ఆసుపత్రికి తీసుకెళ్లామన్నారు. మా పాపతోపాటు మరికొంతమంది పిల్లలు ఆనారోగ్యంతో బాధపడు తున్నారని సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై ఏటీడబ్ల్యూవో శ్రీవిద్యను వివరణ కోరగా అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లల కు వెంటనే వైద్యపరీక్షలు జరిపి వైద్యుల సూచనల మేరకు మందులు ఇస్తున్న ట్టు తెలిపారు. వైశాలికి నర్సులు రక్తపరీక్షలు చేశారని ఇబ్బంది ఏమిలేదన్నా రన్నారు. వైశాలిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకువెళ్లారని అనారోగ్యంగా ఉంటే తల్లిదండ్రులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.

పోలీసు స్టేషన్ ఎదుట దళితుల ధర్నా


పోలీసు స్టేషన్‌వద్ద ఆందోళన చేస్తున్న దళిత యువకులు

పెనుగొండ/ఆచంట, మార్చి 22: ఆచంటకు చెందిన ఓ బాలుడు డాక్టర్ అంబేడ్కర్‌పై సోషల్ మీడియాలో కించపరిచే పోస్టింగ్ పెట్టిన నేపథ్యంలో కొందరు దళితులు గురువారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో పెనుగొండ పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఆ బాలుడిని తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆందోళనకు ఎక్కువ సంఖ్యలో యువకులు రావడంతో సమీపంలో ఉన్న సీసీ కెమేరాలను, పోలీసు స్టేషన్ అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసు స్టేషన్ వద్ద 144 సెక్షన్ విధించారు. ఈ ఘటనపై ఇప్పటివరకు 23 మంది యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ సుభాని తెలిపారు.

అనుచిత పోస్టులు చేసిన బాలుడిపై కేసు

సోషల్ మీడియాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత పోస్టులు చేసిన ఆచంటకు చెందిన ఓ బాలుడిపై ఆచంట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శుక్రవారం ఆచంట ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆచంటకు చెందిన ఓ బాలుడు ఇన్‌స్ట్రాగ్రామ్‌లో అంబేడ్కర్‌పై అనుచిత పోస్టులు చేసినట్టు ఫిర్యాదులు రావడంతో ఐటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి, బాలుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడి గృహనిర్బంధం


గృహనిర్బంధంలో నల్లి రాజేష్

పాలకొల్లు అర్బన్, మార్చి 22 : మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్‌ను శుక్రవారం పట్టణ పోలీసులు గృహనిర్బంధం చేశారు. పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేసిన నేపథ్యంలో కొంతమంది దళిత యువ కులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈవిషయం తెలుసుకున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ పెనుగొండ పోలీస్ స్టేషన్‌కువెళ్ళి ఆందోళన చేయాలని శుక్రవారం సిద్ధం కావడంతో పట్టణ పోలీసులు గృహ నిర్బంధం చేశారు.


కలుషితంగా మారిన మొగలూరు ప్రధాన కాల్వ

మొగల్తూరు కాల్వ నీరు కలుషితం

» పేరుకుపోయిన గుర్రపుడెక్క తూడు
» వ్యాధులు సోకుతాయని గ్రామస్థులు భయాందోళన

మొగల్తూరు, మార్చి 22 : మొగల్తూరు ప్రధాన కాల్వలో ఆపారిశుధ్యం పేరుకుపోవడంతో నీరు కలుషితంగా మారింది. ఈ నీరు మంచినీటి ప్రాజెక్టుల ద్వారా శుద్ధిచేసి వచ్చినా.. వ్యాధులు సోకుతాయేమోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. మొగల్తూరు, రామన్నపాలెం, పేరుపాలెం, కేపీ పాలెం గ్రామాల ఆయకట్టుకు, మొగల్తూరు, కేపీపాలెం బృహత్తర మంచినీటి ప్రాజెక్టులకు ఈ కాల్వ నీరే వినియోగిస్తున్నారు. కాల్వలో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడం, ఎగువ ప్రాంతాల నుంచి కళేభరాలు కొట్టుకు రావడంతో శివారున ఉన్న మొగల్తూరులోని కాల్వ నీరు కలుషితంగా మారుతోంది. రైతులకు గుర్రపుడెక్క, తూడు ప్రభావంతో సాగునీటి ప్రవాహం లేక నీరందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదే నీటిని ఇంజన్ల సాయంతో మంచినీటి ప్రాజెక్టులకు తోడుతున్నారని ప్రాజెక్టు చెరువుల నుంచి కుళాయిల ద్వారా వచ్చేనీటిని తాగితే ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయోనని తీర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మొగల్తూరు ప్రధాన కాల్వలో తూడు, గుర్రపుడెక్క తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైభవంగా మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు

కలిదిండి, మార్చి 22 : మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ చైర్మన్ తమ్మినీడి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బండి తులసీరావు, బోళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పరిచయస్తుడే బ్యాంకు రుణం కాజేశాడు..

» ఆకివీడు పోలీస్‌స్టేషన్‌లో బాధిత వ్యాపారి ఫిర్యాదు

ఆకివీడు, మార్చి 22: ఓ పరిచయస్తుడి ద్వారా తనకు వచ్చిన బ్యాంకు రుణం మొత్తాన్ని రూ.15,00,960 అతడే కాజేశాడంటూ బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు శుక్రవారం తెలిపా రు. స్థానిక రెడ్డివీధిలో జోగి కిరణకుమార్ అద్దెకు నివాసం ఉంటున్నాడు. పట్టణ పరిధిలో సాయి ఐరన్ కబోర్డ్స్ అండ్ సేఫ్ వర్క్స్ పేరుతో షాపు నిర్వహిస్తున్నాడు. సంతమార్కెట్‌కు చెందిన పడాల బాలసుబ్రహ్మణ్యం వ్యాపారం నిమిత్తం కిరణ్‌కుమార్‌కు స్థానిక బ్యాంకులో రుణం ఇప్పించాడు. అనంతరం ఇద్దరూ విశాఖపట్నంలోని కంచరపాలెంకు వెళ్లి అక్కడ లోటస్ ఎంటర్ప్రైజెస్ కంపెనీలోని సరుకుకు సంబంధించి ఓ వ్యక్తికి కొటేషన్‌తో పాటు నగదు బదిలీ చేశారు. త్వరలో సరుకు వస్తుందని చెప్పడంతో తిరిగి ఆకివీడు వచ్చేశారు. సరుకు రాకపోవడంతో ఆరా తీయగా వాస్తవానికి అక్కడ లోటస్ ఎంటర్ప్రైజెస్ కంపెనీ లేదని.. అక్కడ వున్న వ్యక్తి, బాలసుబ్రహ్మణం తన బ్యాంకు రుణాన్ని కాజేశారని గుర్తించి మోసం పోయానన్నాడు. ఈ విషయంపై గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

టి.నరసాపురం, మార్చి 22 : అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. మండలంలోని బండివారిగూడెం గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

కొండపల్లిలో మళ్లీ సైబర్ క్రైం

» ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ.40 వేలు మాయం

కుక్కునూరు, మార్చి 22 : కుక్కునూరు మండలంలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వరుసగా రెండో రోజు శుక్రవారం వైఎస్సార్ చేయూత పథకం కింద డబ్బులు ఖాతాలో జమ చేస్తామని చెప్పి ఓవ్యక్తి ఖాతాలో నుంచి రూ.40వేలు మాయం చేశారు. ముందుగా సైబర్ నేరగాళ్లు సచివాలయ సిబ్బంది అంటూ వలంటీర్లకు ఫోన్ చేస్తున్నారు. మీకు తెలిసిన వారికి ఎవరికైనా ప్రభుత్వ పథకాలకు సంబంధించి డబ్బులు జమ కాకపోతే వారి వివరాలు ఇవ్వాలంటూ కోరుతున్నారు. ఈమేరకు వలంటీర్లు ఎవరికైతే ప్రభుత్వ పథకాలు అందలేదో వారి ఫోన్ నంబరు, అడ్రస్సు చెబుతున్నారు. సైబర్ నేరగాళ్లు ఎవరికైతే ప్రభుత్వ పథకాలు అందలేదో వారికి ఫోన్‌లు చేస్తున్నారు. గూగుల్ పే, లేదా ఫోన్‌పే నంబరు ఇవ్వాలని చెబుతున్నారు. అనంతరం వారిని నమ్మించి ఖాతాలో నుంచి సొమ్ము మాయం చేస్తున్నారు. బాధితులు లబోదిబోమంటూ సైబర్ సెల్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. వరుసగా రెండో రోజు కూడా కుక్కునూరు మండలం కొండపల్లిలో సైబర్ క్రైం నేరాలు జరిగాయి.

వృద్ధురాలి మెడలో ఐదు కాసుల గొలుసు చోరీ

ఏలూరు క్రైం, మార్చి 22 : పాలప్యాకెట్ కోసం వెళ్లి వస్తున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు తెంపుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ తెలిపారు. ఏలూరు శంకర్‌మఠం వీధికి చెందిన గంధం లక్ష్మీత్రివేణి(70) అనే వృద్ధురాలు గురువారం రాత్రి ఆ సెంటర్ సమీపంలో పాల ప్యాకెట్‌కు వెళ్లి ఇంటికి వెళ్తుండగా ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని ఐదు కాసుల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యారు. కిందపడిన ఆమె కొద్దిసేపటి తరువాత కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బెంగళూరు ఎక్స్‌ప్రెస్ పొడిగింపుపై సస్పెన్స్

» ఈనెల 29తో ముగుస్తున్న గడువు



నరసాపురం, మార్చి 22: నరసాపురం-బెంగళూరు మధ్య నడుస్తున్న వీక్లీ ఎక్స్‌ప్రెస్‌పై సస్పెన్స్ నెలకొంది. ఈనెల 29తో పొడిగింపు గడువు ముగుస్తుంది. ఈ క్రమంలో వచ్చే నెల నుంచి ఈ రైలు కొనసాగుతుందా ? లేదా అనే సస్పెన్స్ ప్రయాణికుల్లో నెలకొంది. వచ్చే నెలలో అడ్వాన్స్ రిజర్వేషన్ టిక్కెట్లు ఇవ్వడం లేదు. డబ్లింగ్ లైన్ పూర్తయిన తరువాత దక్షిణమధ్య రైల్వే నరసాపురం నుంచి బెంగళూరుకు రెండు ప్రత్యేక రైళ్ల ప్రవేశపెట్టింది. వాటిలో ఒకటి గుంటూరు-మార్కపురం మీదుగా, మరొకటి విజయవాడ-ఒంగోలు మీదుగా నడుపుతున్నారు. వారంలో రెండుసార్లు ఈ రైళ్లు నడుస్తూ వచ్చాయి. మూడు నెలల క్రితం గుంటూరు మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసింది. అప్పటి నుంచి 07153 నంబర్‌తో ఒంగోలు మీదుగా వెళ్లే రైలు మాత్రం కొనసాగుతుంది ఈ రైలు ప్రతి శుక్రవారం నరసాపురంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం బెంగళూరు చేరుతుంది. తిరిగి ఆదే రోజు అక్కడ బయలుదేరి ఆదివారం నరసాపురం వస్తుంది. వారానికి ఒక్కసారి నడుపుతున్నప్పటికీ డిమాండ్ ఫుల్‌గా ఉండడంతో వారంలో మరోరోజు పొడిగించి ఏప్రిల్ నుంచి వారంలో రెండు రోజులు నడుపుతారని ప్రయాణికులు ఎదురుచూశారు. దీనికి భిన్నంగా రైల్వే వ్యవహారం కనిపిస్తోంది. ఈనెల 29తో గడువు ముగుస్తోంది. పొడిగింపుపై ఎటువంటి ప్రకటన చేయలేదు. వచ్చేనెల నుంచి ఈ ఎక్స్‌ప్రెస్ నడుస్తోందా? లేదా అనే సస్పెన్స్ నెలకొంది.

కోడ్ అతిక్రమించిన జనసేన నాయకులపై కేసు

ఏలూరు క్రైం, మార్చి 22 :ఎన్నికల నిబంధనలు అతిక్రమించారని దెందులూరు నియోజకవర్గ జనసేన నాయకులపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గురువారం రాత్రి ఏలూరు అశోక్‌నగర్‌లోని నియోజకవర్గ జనసేన నాయకుడు కొఠారు ఆదిశేషు క్యాంపు కార్యాలయం వద్ద దెందులూరు జనసేన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు ఎక్కువమంది రావడంతో కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపైనే వీరి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏలూరులోని ఫ్లయింగ్ స్క్వాడ్ నంబరు-4 ఇన్‌ఛార్జి అయిన పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ శనగన బాలాజీబోసుబాబు తన సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనుమతులు లేకుండా సమావేశం ఎందుకు పెట్టారంటూ ప్రశ్నించారు. మరోవైపు ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ వారి సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. బోసుబాబు ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు దెందులూరు జనసేన నాయకులైన కొఠారు ఆదిశేషు, మట్టా సాయిసుధాకర్, కోటగిరి వెంకటసుధాకర్, మట్టా రంగబాబులపై ఎన్నికల నిబంధనలు అతిక్రమించారంటూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

» క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన డీఎస్పీ, సీఐ



పోలవరం, మార్చి 22 : ఆటో బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయాల పాలైన ఘటన పోలవరం మండలం పట్టిసీమ పంచాయతీ వెంకటాపురం చెరుకు ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం జరిగింది. సీఐ మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం దొండపూడి నుంచి వస్తున్న సర్వీసు ఆటోని పోలవరం నుంచి వేగంగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఆటోలో పోలవరం ఆసుపత్రికి వెళుతున్న రోగి, బైక్ నడుపుతున్న వ్యక్తి గాయాలపాలయ్యారు. అదే సమయంలో ఆ మార్గాన వెళుతున్న డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ మధుబాబు తమ వాహనాన్ని ఆపి గాయలపాలైన వారిని మరో వాహనంలో పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

ఏలూరు క్రైం, మార్చి 22 : మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురు వ్యక్తులకు కోర్టు జరిమానా విధించింది. ఏలూరు ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వారిని శుక్రవారం కోర్టుకు హాజరుపర్చగా ఒకొక్కరికి రూ.మూడు వేల చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.



కమ్మేసిన పొగమంచు

ఒకవైపు ఎండలు మండుతున్నాయి. ఉక్కబోత తోడు కావడంతో ప్రజలు తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. మరోవైపు శుక్రవారం ఉదయం గంట సేపు ఆచంట మండలంలో పలు చోట్ల పొగమంచు కమ్మేసింది. ఉదయం తొమ్మిది గంటలైనా మంచు వీడకపోవడంతో పలు వాహనదారులు రోడ్డు కానరాక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- ఆచంట

ప్రశాంతంగా సాగుతున్న పది పరీక్షలు


పరీక్షా కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు

పెదవేగి, మార్చి 22: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. మండలంలో ఆరు కేంద్రాల్లో 1064మంది మంది పరీక్షలు రాయాల్సి ఉండగా శుక్రవారం లెక్కలు పరీక్షకు 950మంది హాజరయ్యారని ఎంఈవో సీహెచ్.బుధవాస్ తెలిపారు. 114 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ఆయన చెప్పారు. పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్ఠ బందోబస్తుతోపాటు తాగునీరు, ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు చేశామన్నారు.

● లింగపాలెం: మండలంలోని పదె తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు పీవీ.రామ్‌శర్మ (స్క్వాడ్) తెలిపారు. రంగాపురం, ధర్మాజీగూడెం పరీక్షాకేంద్రాల్లో తనిఖీలు నిర్వహించిన ఆయన ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ జరగలేదన్నారు. రంగాపురంలో 249మంది విద్యార్థులకు 20మంది గైర్హాజరయ్యారు. ధర్మాజీగూడెంలో 186మంది విద్యార్థులకు 9మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

● పోలవరం: మండలంలో గూటాల పాఠశాలలో 140 మంది విద్యార్థులకు 116 మంది, పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 262 మంది విద్యార్థులకు 256 మంది, సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో 138 మంది విద్యార్థులకు 90 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

మానవ మనుగడలో నైతిక విలువలకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 22: మానవ మనుగడలో నైతిక విలువలు, మానవ హక్కులకు ఎంతో ప్రాధాన్యం ఉందని సెబ్ ఏఎస్పీ సూర్యచంద్రరావు అన్నారు. సీఆర్ఆర్ కళాశాలలో మానవ హక్కులు, నైతిక విలువలు అనే అంశంపై బీఏ విద్యార్థులకు వాల్యూయాడెడ్ కోర్సుని శుక్రవారం సూర్యచంద్రరావు ప్రారంబించారు. హక్కులు, సమాజంలో నైతిక విలువలు తెలుసుకొని విద్యార్థులు ప్రగతిపథంలో పయనించడానికి దోహదపడతాయన్నారు. కరస్పాండెంట్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాసరావు, అధ్యాపకులు కేశవ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి


ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 22: అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురవకుండా జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. నగరంలోని వెంకటాపురం, రామానగర్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక వేడితో శరీరంలో ఉండే నీరు చెమటరూపంలో బయటకు పోయి వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. శరీర ఉష్ణోగ్రత పెరగడం, డీహైడ్రేషన్, వాంతులు, అయాసపడి నీరసించిపోవడం తదితర లక్షణాలన్నీ వడదెబ్బకు సూచనలేనన్నారు. మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లరాదన్నారు. కొబ్బరి నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం, మంచినీరు తీసుకోవడం, లేతరంగు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. తలకు టోపీ లేదా తలపాగా, గొడుగు వాడడం మేలన్నారు. సాధారణ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, ముఖ్యంగా మలేరియా, డెంగీ దోమలు ఎక్కువగా మంచినీటి నిల్వప్రాంతాల్లో పెరుగుతాయి కనుక పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వైద్యసిబ్బంది రామాంజనేయులు, కిరణ్, శ్రీనివాస్, రమేష్, సుమతి, నాగలక్ష్మి, రాణి, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఉద్యోగుల బదిలీలు అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

ఏలూరు టూటౌన్, మార్చి 21: ఎన్నికల నోటిఫికేషన్ రోజునే ఆకస్మాత్తుగా యూపీహెచ్‌సీలో 16మంది ఉద్యోగులను అన్యాయంగా బదిలీ చేశారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు సోమయ్య అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలతో సంబంధం లేని వైద్య సిబ్బందిని ఎందుకు మార్చారో వివరణ ఇవ్వాలన్నారు. అధికారులు ఉద్దేశపూర్వకంగా అనేక బదిలీలు చేశారన్నారు. బదిలీలను నిలుపుదల చేసి మరలా యధాస్థితికి వారందర్నీ తీసుకురావాలని డిమాండ్ చేశారు.

దోమల నివారణకు డ్రైడే పాటించండి


ప్రగడవరంలో డ్రైడే అవగాహన కార్యక్రమం

చింతలపూడి, మార్చి 22: దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.కె అబ్రార్ హుస్సేన్ అన్నారు. ప్రగడవరం, వెంకంపాలెం గ్రామాల్లో డ్రైడేపై ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసరాల పరిశుభ్రత, నీటి తొట్టిలు శుభ్రపరచడం, మురుగునీరు లేకుండా చేయడం వల్ల దోమలవ్యాప్తి తగ్గుతుందన్నారు. దోమల వల్లే ప్రమాదకర రోగాలు చికన్‌గున్యా, ఫైలేరియా వంటివి ప్రబలుతాయన్నారు. ప్రజల్లో మరింత అవగాహన చేయటానికి సిబ్బంది ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సీలు భరత్‌కుమార్, అరుణ, విష్ణుమూర్తి, నర్మద, సునీత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నీరు పొదుపుగా వాడాలి


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, మార్చి 22: ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి కె.రత్నప్రసాద్ సూచించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సీఆర్ఆర్ కాలేజీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ నీటిని కాపాడుకోవాలని ముఖ్యంగా ఇంకుడు గుంటల ద్వారా భూగర్భ జలాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థలు చిన్న చిన్న నీటి కొలనులను, చెరువులను కాపాడాలని సూచించారు. రూరల్ వాటర్ సప్లై అండ్ శానిటేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాలు, పరిశ్రమల వ్యర్థాల నుంచి నీరు విపరీతంగా దుర్వినియోగం అవుతుందని, శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాలను శుద్ధి చేసిన తరువాత మాత్రమే నీటిని విడుదల చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె రామరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజానికి ఉపయోగపడే పనులను అలవాటు చేయడం చేసుకోవాలన్నారు. కరస్పాండెంట్ కెఎస్ విష్ణు మోహన్, చైతన్య కుమార్, మానవతా సభ్యులు అజయ్‌బాబు, గ్రామోదయ ఎన్‌జీవో శ్రీనివాసరావు పలువురు పాల్గొన్నారు.

● ఏలూరు ఎడ్యుకేషన్: ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో ప్రపంచ జల వనరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నీరు మూడొంతులుగావున్నప్పటికీ జీవకోటికి ఆధారమైన మంచినీరు కేవలం రెండు శాతమేనన్నారు. భూగర్భజలాలు, సహజ నీటి వనరులను సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. ఇరిగేషన్ డీఈఈ వై.అర్జున్, ఉద్యోగులు మధుసూదన్, జయరాజు, వెంకటపతిరాజు, వీరేంద్ర, కృష్ణకుమారి పాల్గొన్నారు.

● చింతలపూడి: నీటిని కలుషితం చేయరాదని బార్‌అసోసియేషన్ సభ్యులు డేవిడ్‌రాజు అన్నారు. కోర్టు ఆవరణలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా కక్షిదారులకు, పారాలీగల్ వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ అలీ, ఏసుపాదం, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీపై ఆరోపణలు అవాస్తవం

బుట్టాయగూడెం, మార్చి 22: గుబ్బల మంగమ్మ ఆలయ కమిటీపై కొందరు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని కమిటీ చైర్మన్, కోర్సవారిగూడెం సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గుడి కమిటీపై గిరిజనేతరుల పెత్తనం అధికమైందని అధికారులకు ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏసుబాబు గతంలో పీఆర్.గూడెం ఎంపీటీసీగా పనిచేశారని, గిరిజన సమస్యలపై జరిగిన అనేక ఆందోళనల్లో పాల్గొన్నట్లు తెలిపారు. గుడి తరఫున నిర్వహించే కార్యక్రమాల్లో అతడిని పిలవడం జరుగుతుందని తమపై పెత్తనం చేయడం లేదన్నారు. ఆరోపణలు చేయడం సరికాదన్నారు.



పెదపాడు మండలం ఏపూరు, ఏలూరు వైఎస్ఆర్ కాలనీలో సాయుధ బలగాలు, పోలీసుల కవాతు

ఓటర్లకు రక్షణగా ఉంటాం..
నిర్భయంగా ఓటేయండి
గ్రామాల్లో సాయుధ బలగాలు, పోలీసుల కవాతు

ఏలూరు క్రైం, మార్చి 22 : ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్ రాజశేఖర్ సూచించారు. సీఐ ఎన్ రాజశేఖర్, రూరల్ ఎస్ఐ రాజారెడ్డి, సిబ్బందితో పాటు సాయుధ బలగాలు ఏలూరు, పోణంగి వైఎస్ఆర్ కాలనీ తదితర ప్రాంతంలో శుక్రవారం కవాతు నిర్వహించారు. వివిధ కూడళ్లలో ప్రజలను ఉద్దేశించి సీఐ రాజశేఖర్ మాట్లాడారు. రాజకీయపార్టీలపై అభిమానంతో ఇతర పార్టీల వారిని దూషించరాదన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకునే స్వేచ్ఛ అందరికీ ఉంటుందని, ఎవరైనా ఆటంకాలు సృష్టించినా, ప్రలోభాలకు గురిచేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే సహించేది లేదన్నారు. గత ఎన్నికల్లో కేసులలో ఉన్న వారిపై నిఘా ఉంటుందని, వారు సమస్యలను సష్టించరాదని, ఏదైనా సమాచారం ఉంటే తమకు తెలియజేయాలే తప్ప ఎలాంటి అల్లర్లకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికి నచ్చినట్లు వారు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చున్నారు.

● పెదపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా తగిన వాతావరణం ఏర్పాటు చేయడంతో పాటు, ఎన్నికల్లో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులకు, పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సాయుధ బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరగటానికి ప్రణాళికలు

ఏలూరు టూటౌన్: ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు కార్యచరణ రూపొందిస్తున్నట్లు డీపీవో శ్రీనివాస్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.


సమావేశంలో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణ

వెంకటకృష్ణ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు తమ ఓటుహక్కు తప్పనిసరిగా వినియోగించుకుని ప్రజాస్వామ్య పటిష్టతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీవో కృష్ణమూర్తి, ఏసీపీ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు నిబంధనలు పాటించాలి

ఉంగుటూరు: రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఇంటింటి ప్రచారానికి సైతం 48 గంటల ముందుగా అనుమతి తీసుకోవాలని ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి ఖాజావలి కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పక్షాల నేతలకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో సువిధ యాప్ ద్వారా అనుమతులు పొందాలని ఇప్పటిదాకా సాంకేతిక సమస్య వల్ల పూర్తి స్థాయిగా పని చేయక పోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. డీఎస్పీ ఈ.శ్రీనివాసులు మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు. సీఐ మోగంటి వెంకట సుభాష్, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని మత్తు పదార్థాల అడ్డాగా మార్చేశారు
వైసీపీ పాలనపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని ధ్వజం


గుండుగొలనులో మాట్లాడుతున్న గన్ని, ధర్మరాజు

భీమడోలు, మార్చి 22: రాష్ట్రాన్ని మత్తు పదార్థాల అడ్డాగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మార్చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. గుండుగొలనులో శుక్రవారం జరిగిన సమావేశంలో గన్ని వీరాంజనేయులు, కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. గన్ని మాట్లాడుతూ జగన్ రెడ్డికి ధన దాహం తీరలేదని, ఏపీని డ్రగ్స్ అడ్డాగా మారుస్తున్న జగన్ అండ్ కో డ్రగ్ మాఫియా బయటపడిందన్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని సైకో జగన్ బ్రెజిల్‌కు చెందిన డ్రగ్స్ మాఫియా ముఠా సాయంతో డ్రగ్స్‌ను దిగుమతి చేస్తున్నారని ఆరోపించారు. డబ్బు, మద్యం, చీరలు ఎన్నికల అస్త్రాలుగా జగన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ సంస్థ ఎండీ కూనం వీరభద్రరావు విజయసాయిరెడ్డికి సన్నిహితంగా ఉంటారని గన్ని వివరించారు. అంతర్జాతీయ డ్రగ్స్ కుంభకోణం జగన్ ఆధ్వర్యంలో జరగడం ప్రజలు గమనిస్తున్నారని గన్ని అన్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు.

● గణపవరం: వైసీపీ ప్రజా వ్యతిరేక పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిద్దామని గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. పిప్పర టీడీపీ కార్యాలయంలో గణపవరం మండల కార్యకర్తల సమావేశం ఇందుకూరి రామకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజును గెలిపించాలని కార్యకర్తలను కోరారు. అభ్యర్థి ధర్మరాజు మాట్లాడుతూ వైసీపీ కబంద హస్తాల్లో చిక్కుకున్న ఏపీకి విముక్తి కల్పించడమే జనసేన లక్ష్యమన్నారు. టీడీపీ నాయకులు ఐటీ సుబ్బరాజు, అద్దేపల్లి వాసురాజు, యాళ్ళ సుబ్బారావు, దండు బాబ్జీరాజు, కూసంపూడి సురేంద్రకుమార్, కూనసాని నాగేశ్వరరావు, జనసేన నాయకులు తోట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: రానున్న ఎన్నికలలో ప్రతి కార్యకర్త కష్టించి కూటమి అభ్యర్థిని గెలిపించాలని గన్ని వీరాంజనేయులు కోరారు. సోషల్ మీడియా ప్రచారంతో అపోహలకు తావివ్వ వద్దని గన్ని, ధర్మరాజు కోరారు. టీడీపీ, జనసేన శ్రేణులు ఐకమత్యంగా ప్రచారం చేసి జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు విజయానిక కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

ఏలూరు రూరల్ స్పోర్ట్స్ మార్చి 22: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాక్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు డీఎస్‌వో వి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. 8 సంవత్సరాల నుంచి 14ఏళ్లలోపు బాలబాలికలకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేస్తున్న క్రీడా శిక్షకులు, అనుభవజ్ఞులైన క్రీడాకారుల నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్రీడా సామగ్రి, నిర్వహణ ఖర్చులు, శిక్షకులకు గౌరవ వేతనం అందజేస్తామన్నారు. దరఖాస్తులు ఈనెల 28లోపు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయానికి పోస్ట్‌ద్వారా, వ్యక్తిగతంగా కాని అందజేయాలన్నారు. వివరాలకు 9866317326 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఆటో కార్మికుల నేత కిరణ్‌కు నివాళి


కిరణ్ చిత్రపటం వద్ద నేతల నివాళి

జంగారెడ్డిగూడెం, మార్చి 22: ఆటో, మోటార్, రవాణా రంగ కార్మికుల హక్కుల కోసం ఉద్యమించిన కిరణ్ చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. కార్మిక హక్కుల కోసం విశేష కృషి చేసిన కిరణ్ హైదరాబాద్‌లో మృతి చెందడంతో స్థానిక ధర్మన్న స్మారక భవనంలో శుక్రవారం న్యాయవాది యు.ఏసుబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ.రమణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అనేక ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని అటువంటి నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు తమ్మ సోమలింగ మల్లికార్జునరావు, ముప్పిడి అబ్బులు, గంపల వెంకటేష్, పీవోడబ్ల్యూ నాయకురాలు కె.రామలక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

హీరో మెగా సర్వీస్, ఎక్స్ఛేంజ్ శిబిరం

ఏలూరు క్రైం, మార్చి 22 : ఏలూరులోని సాయి స్వర్ణ హీరో షోరూమ్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు మెగా సర్వీస్, ఎక్స్ఛేంజ్ కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు షోరూమ్ జనరల్ మేనేజర్ ఏవి సోమేశ్వరరావు, సర్వీస్ మేనేజర్ మనోజ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రామకోటి ఆవరణలో ఈనెల 24 నుంచి 26 వరకు మెగా క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హీరో కంపెనీకి చెందిన ఏ మోటారు వాహనమైనా రూ.99 రూపాయలకే జనరల్ సర్వీస్ చేస్తారన్నారు. వాహనదారులకు కంటి పరీక్షలు, దంత పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హీరో స్కూటర్ కొనుగోలుపై అతి తక్కువ డౌన్ పేమెంట్ రూ.99 చెల్లించి కొత్త స్కూటర్ పొందవచ్చునన్నారు. రూ.3999 డౌన్ పేమెంట్‌తో కొత్త వాహనం కొనుగోలు చేయవచ్చన్నారు.

కనకదుర్గమ్మకు ధాన్యాధివాసం కార్యక్రమం


ధాన్యాధివాసం నిర్వహిస్తున్న భక్తులు

బుట్టాయగూడెం, మార్చి 22: రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భక్తులు ధాన్యాధివాసం నిర్వహించారు. పుష్పాధివాసం, ప్రత్యేక పూజలను జరిపించారు. అమ్మవారి కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ భౌమరాజు సత్యనారాయణరాజు, ధర్మకర్త భౌమరాజు ధనుంజయరాజు తెలిపారు.

గర్భిణులు ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు పాటించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ

కామవరపుకోట, మార్చి 22: గర్భిణులు ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ పద్మావతి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఈనెల 23 వరకు పోషణ పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. తడికలపూడి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరిరక్షణపై శుక్రవారం చర్చావేదిక నిర్వహించారు. గర్భిణులు ఐసీడీఎస్ ద్వారా సరఫరా చేస్తున్న కిట్‌లను వినియోగించుకుని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలన్నారు. కార్యక్రమంలో కిశోర బాలికలు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం సీడీపీవో డి.బ్యూలా, పి.సునీల్‌రాజ్‌శేఖర్, ఏవో మల్లిక, సూపర్‌వైజర్లు బీవీఎల్.మంగాదేవి, ఎన్.వీరకుమారి, అంగన్‌వాడీలు గౌరి, జ్యోతి, పద్మ, దేవమాత, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.12.58 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

పెదపాడు, మార్చి 22 : అప్పనవీడు అభయాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.12,58,970 వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. పర్యవేక్షణాధికారి సన్యాసిరావు, ఆలయ సిబ్బంది, భక్తుల సమక్షంలో సోమవారం ఆదాయం లెక్కించారు. పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోలవరంలో భారీ వర్షం
నేలనంటిన మొక్కజొన్న
నిలిచిన విద్యుత్ సరఫరా
విద్యార్థులకు తిప్పలు


ఈదురు గాలులకు నేలనంటిన మొక్కజొన్న

పోలవరం, మార్చి 22 : మండలంలో రెండు రోజుల క్రితం ఈదురు గాలి, వర్షంతో రైతులకు నష్టం వాటిల్లింది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పరీక్షలు రాస్తున్న పదో తరగతి విద్యార్థులు, ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు, వీధులు జలమయమయ్యాయి. చేగొండపల్లి, కొత్త రామయ్యపేట, కొత్త పైడిపాక, కొత్త తోటగొంది, కొత్త కోండ్రుకోట పునరావాస కాలనీలలో కొత్త పట్టిసీమ, గూటాల, పోలవరం, బీసీ కాలనీ, బెస్తావీది, ఎల్ఎన్‌డీ.పేట గ్రామాలలో నీరు నిలిచి ప్రజలు అవస్థలు పడ్డారు.

తుఫాన్ సాయం అందలేదు..

మిచౌంగ్ తుఫాన్ ధాటికి మండలంలో పలువురు రైతులు నష్టపోయారు. చేతికొచ్చిన పంట కోల్పోయిన రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈదురు గాలులకు మొక్కజొన్న పంటలు నేలనంటాయి. మండలంలో 602 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. తుఫాను నష్టం కింద ముఖ్యమంత్రి బటన్ నొక్కినా రైతులకు సొమ్ము అందనే లేదని రైతులు వాపోతున్నారు.

పరిహారం అందలేదు



మిచౌంగ్ తుఫాను వల్ల గతేడాది నష్టపోయాను అప్పటి పరిహారం అందనే లేదు. ఇప్పుడు ఈదురు గాలులకు వర్షానికి 1.20 సెంట్లు మొక్కజొన్న నేలవాలింది. రైతుల బతుకులు బుగ్గిపాలవుతుంటే, పరిహారం అందక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే పరిహారాలందించి ఆదుకోవాలి.

\- సప్పా వెంకటేశ్వరరావు, రైతు, పట్టిసీమ

పంట నష్టం.. వడ్డీ భారం



ఈ ఏడాది రూ.30 వేల కౌలుకు 4 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. రూ.30 వేల పెట్టుబడి పెట్టాను. ఈదురు గాలులకు పంట నేలనంటింది. పంట నష్టంతో వడ్డీ భారం మిగిలింది. ప్రభుత్వం స్పందించి సహాయం అందించాలి. మిచౌంగ్ తుఫాను పరిహారం కూడా అందలేదు, రైతు మనుగడ సాధించడం చాలా కష్టం.

\- రెడ్డి సత్యనారాయణ, రైతు, పట్టిసీమ

మొక్కజొన్న నేలనంటింది



మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. గాలులు, భారీ వర్షానికి ఎకరంన్నర పంట నేలనంటింది. గత ఏడాది మిచౌంగ్ తుఫాను పరిహారం అందలేదు. రైతులు బతకడం కష్టం. ఇప్పటికే కొంతమంది రైతులు అప్పుల భారంతో పురుగు మందు తాగి ప్రాణాలు తీసుకున్నారు. ప్రభుత్వం పరిహారం తక్షణమే అందించాలి.

\- పూడి దుర్గారావు, రైతు, పాత పట్టిసీమ

టీడీపీ కూటమికి ఎమ్మార్పీఎస్ మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఏలూరు టూటౌన్, మార్చి 21: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ తెలిపారు. లంకపేట ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. రమేష్ మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్విరామ పోరాటం చేస్తున్నప్పటికి ముఖ్య మంత్రి జగన్ ఎటువంటి సహకారం అందించలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం దళితులకు అమలు చేసిన 26 పథకాలను జగన్ రద్దుచేసి దళితులకు తీరని అన్యాయం చేశారన్నారు. విదేశీ విద్య పథకానికి చంద్రబాబు అంబేడ్కర్ పేరు పెడితే ఈ ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యగా మార్చిందన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని భారీ మెజారిటీతో గెలిపించడానికి ఎమ్మార్పీఎస్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో శేఖర్, విజయ, వి.సిద్ధు, మురళి, నాగేంద్రబాబు, పాల్గొన్నారు.

మద్దిపాటికి ఎస్సీ సెల్ సంఘీభావం

ఉంగుటూరు: గోపాలపురం టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు విజయాన్ని కాంక్షిస్తూ మండల ఎస్సీ సెల్ నాయకులు సంఘీభావం తెలిపారు. నేకూరి ఆశీర్వాదం, గంటా యువరాజు, రత్నం రాజు, తాడిగడప సుబ్బారావు తదితరులు ఆయనను కలిశారు.

కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలను కలసిన బొజ్జిదొర



పోలవరం, మార్చి 22 : మాజీ ఎమ్మెల్యే బాడిస దుర్గారావు తనయుడు బాడిస బొజ్జిదొర విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను శుక్రవారం కలిశారు. బొజ్జిదొరను షర్మిల పార్టీ కండువాతో సత్కరించారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు శ్రమిస్తానని, పార్టీ విజయానికి కృషి చేస్తానని బొజ్జిదొర నాయకులకు హామీ ఇచ్చారు.


మసీదులో ప్రత్యేక నమాజ్ చేస్తున్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో రంజాన్ పవిత్ర ఉపవాస నమాజ్

పోలవరం, మార్చి 22: రంజాన్ పవిత్ర మాసంలో రెండో శుక్రవారం సందర్భంగా మండలంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో రంజాన్ ఉపవాస నమాజ్ నిర్వహించారు. జమాతె మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండి యాసీన్ షరీఫ్ మాట్లాడుతూ సుమారు 2వేల మంది ప్రత్యేక రంజాన్ ఉపవాస నమాజ్‌లో పాల్గొని ఇఫ్తార్ విందు స్వీకరించినట్లు తెలిపారు. పేదలకు ముస్లింలు ఫిత్రా దానాలు ఇచ్చినట్లు తెలిపారు. రంజాన్ మాసంలో ప్రతి శుక్రవారం మరింత ప్రాముఖ్యత కలిగిన దినమని అన్నారు.

ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి బిషప్ ఆశీస్సులు

ఏలూరు టూటౌన్, మార్చి 21: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి ఏలూరు కథోలిక పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర ఆశీస్సులు అందజేశారు. బిషప్స్ హౌస్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా అబ్బయ్యచౌదరి కలిశారు. బిషప్ జయరావుకు విశాఖపట్నం అగ్రపీఠాధిపతిగా అదనపు బాధ్యతలు అప్పగించటంపై ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఏఎస్ఐగా పదోన్నతి

పెదవేగి, మార్చి 22: పెదవేగి హెడ్ కానిస్టేబుల్ పీఎస్వీ.ప్రవీణ్‌కు ఏఎస్ఐగా పదోన్నతి లభించింది. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారని ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రవీణ్‌ను ఎస్ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది అభినందించారు.

నేడు జనార్దనస్వామి కల్యాణ మహోత్సవం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 22: అగ్రహారంలోని జనార్ధనస్వామి కోవెల వద్ద శనివారం సాయంత్రం జనార్ధనస్వామి, రంగనాయక స్వామివార్ల దివ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో గుబ్బల రామ పెద్దింట్లరావు తెలిపారు. తొలుత ఎదుర్కోలు సన్నాహం జరుపుతామని, అనంతరం కళ్యాణ మహోత్సవాన్ని వేద మంత్రోచ్చరణతో నిర్వహిస్తామని తెలియచేశారు. భక్తులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్ని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణ

ఏలూరు కార్పొరేషన్, మార్చి 22: స్థానిక ఆదివారపుపేటలోని షిరిడీ సాయి ప్రేమ మందిర్ వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తులు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణను 108 సార్లు పఠించారు. తొలుత బాబా వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శనివారం అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేసినట్టు ఆలయ ధర్మకర్త, టీడీపీ నాయకులు ఇసుకపల్లి తాతారావు తెలియచేశారు.

శనీశ్వరాలయం చతుర్ధ వార్షికోత్సవాలు

కామవరపుకోట, మార్చి 22: ఆడమిల్లి శనీశ్వరాలయం చతుర్ధ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం కంఠ మహేశ్వర స్వామికి, పార్వతీదేవికి, హరిహరపుత్ర అయ్యప్పస్వామికి, కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తాతా సర్వేశ్వరరావు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. కామాక్షిదేవి పవనశుత భజన సమాజం వారు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈనెల 24 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని సర్వేశ్వరరావు తెలియజేశారు.

వెంకటాపురం దుర్గమ్మ తిరునాళ్ల ప్రారంభం

కామవరపుకోట, మార్చి 22: రావికంపాడు పంచాయతీ వెంకటాపురంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద తిరునాళ్ళు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి భక్తులు అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త కోటగిరి విశ్వనాథం మిత్రబృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

అప్రోచ్ అయ్యేదెలా?

ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్లు

అప్రోచ్ రహదారులు ప్రమాదకరంగా మారాయి. వంతెనకు రెయిలింగ్ లేక రహదారి కోతకు గురై ఒకచోట.. రహదారిపై రాళ్లు లేచిపోయి అడుగడుగునా గోతులతో మరోచోట ఇలా ప్రమాదకరంగా ఉన్నాయి. కలిదిండిలోని కొండంగి లాకుల వద్ద సీబీ కెనాల్‌పై వంతెన అప్రోచ్ రోడ్డు రెయిలింగ్ లేక వాహనాలు అదుపు తప్పి కాల్వలో పడిపోతున్నారు. ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామంలోని అప్రోచ్ రోడ్డుపై కనీసం నడవలేమని ప్రజలు వాపోతున్నారు. అధికారులూ.. పట్టించుకోండి.


సీబీ కెనాల్‌పై ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు

కలిదిండి, మార్చి 22 : మండలంలో కొండంగి లాకుల వద్ద సీబీ కెనాల్‌పై వంతెన అప్రోచ్ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. రెయిలింగ్ లేక వాహనాలు అదుపు తప్పి కాల్వలో పడి వాహనదారులు క్షతగాత్రులవుతున్నారు. రోడ్డు మార్జిన్ కోతకు గురవటం, ఎదురెదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించుకునే వీలు లేకపోవటంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీంతో ప్రయాణికులు పలు అవస్థలు పడుతున్నారు. ఉప్పుటేరు వెంబడి ప్రధాన రహదారి ఈ వంతెనపై నుంచి వెళ్లటంతో నిత్యం వంతెన రద్దీగా ఉంటుంది. ఈ వంతెన వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ వంతెన పక్కనే కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. రైతులు రాత్రి వేళలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన అప్రోచ్ రోడ్డు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కొండంగి లాకుల వద్ద వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్డుకు రైలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆ రహదారిపై నడవలేం!


అధ్వానంగా పెయ్యేరు అప్రోచ్ రోడ్డు

ముదినేపల్లి, మార్చి 22 : ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామ అప్రోచ్ రోడ్డు అధ్వానంగా మారింది. ముదినేపల్లి - కైకలూరు జాతీయ రహదారి నుంచి పెయ్యేరు వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడక కూడా నరకయాతనగానే ఉంది. ఈ రోడ్డు అడుగడుగునా గోతుల మయంగా మారింది. వాహనాల రాకపోలకు ప్రమాదకరంగా మారింది. పదేళ్లుగా ఈ రహదారి అభివృద్ధిని పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. పంచాయతీ రాజ్ అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేయించలేదు. నిత్యం ముదినేపల్లి హైస్కూల్‌కు సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పలు చోట్ల కుంగిపోయి వాహనాలు బోల్తా పడే అవకాశం ఉంది. గతంలో జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు నిధులతో ఈ రోడ్డును అభివృద్ధి చేసే వారు. ఇప్పుడు ఆ నిధులు మంజూరు కాకపోవటంతో రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. రహదారిపై ప్రమాదకర గోతులైనా పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అనుమతులు తప్పనిసరి : ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో భవానీ శంకరి

నూజివీడు, మార్చి 22: సార్వత్రిక ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు విధిగా సువిధ యాప్‌లో ప్రచార సంబంధ అనుమతులను తీసుకోవాల్సి ఉంటుందని నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పక్షాల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ నిబంధనల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని, ఏ చిన్న అతిక్రమణ చోటు చేసుకున్నా పోర్టల్లో ఫిర్యాదులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు ఎప్పుడు? ఎక్కడ? ప్రచారం నిర్వహించనున్నారో చివరికి జెండాలు కట్టే దగ్గర నుంచి బ్యానర్ల వరకు అనుమతి తీసుకోవాలన్నారు. మారిన నిబంధనల ప్రకారం చివరికి బ్యానర్లు ప్రింట్ చేసే విషయంలో కూడా కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే అన్నారు. దీని పై రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ అనుమతి తీసుకోవాలి అంటే వివిధ స్థాయిల అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఫలితంగా అమూల్యమైన సమయం వృథా అవుతోందని, గ్రామాల పర్యటన విషయంలోనూ అనుమతులు పొందాలి అంటే అసాధ్యమని రాజకీయ పక్షాల నాయకులు పేర్కొన్నారు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. వివిధ రాజకీయ పక్షాల నాయకులు, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

28 నుంచి బాస్కెట్ బాల్ పోటీలు


క్రీడా పోటీల వివరాలు వెల్లడిస్తున్న స్పోర్టింగ్ క్లబ్ సభ్యులు

నూజివీడు టౌన్, మార్చి 22: బొబ్బిలి కొండలరావు మెమోరియల్ క్రీడా పోటీలను ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్నట్టు స్పోర్టింగ్ క్లబ్ సభ్యుడు టీవీ కృష్ణారావు తెలిపారు. స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నూజివీడు డీఏఆర్ కళాశాలలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు బొబ్బిలి కొండలరావు మెమోరియల్ జాతీయ స్థాయి ఆహ్వాన బాస్కెట్ బాల్ పోటీలు లీగ్ అండ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నూజివీడు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్లు రామిశెట్టి మురళి, పగడాల సత్యనారాయణ, ఇతర సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు యువకుల చేరిక


పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మరీదు శివరామకృష్ణ

ముసునూరు, మార్చి 22: మండలంలోని గుడిపాడు, గుళ్ళపూడి గ్రామాల యువకులు శుక్రవారం జనసేనలో చేరారు. చేబత్తిన నవీన్, పంతగాని నాగార్జున, కొయ్యూరు విజయ్, బత్తుల మణికంఠ, దాసరి సురేంద్రతోపాటు మరికొంతమంది యువకులకు జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివ రామకృష్ణ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. యువతకు ఉపాధి లేకుండా చేసిన వైసీపీ పాలన నచ్చక, పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరామని, నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి విజయానికి తమ వంతు కృషి చేస్తామని యువత పేర్కొన్నారు. ముసునూరు జనసేన నాయకులు గిరి గోపీ కృష్ణ, చెర్రీ తదితరులు పాల్గొన్నారు.


లోపూడిలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు


మండవల్లి మండలం గన్నవరంలో పథకాల క్యాలెండర్ పంపిణీ

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ముసునూరు, మార్చి 22: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం చంద్రబాబు పాలనతోనే సాధ్యమని టీడీపీ గ్రామ అధ్యక్షుడు వేంపాటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం లోపూడిలో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి, కరపత్రాలను అందజేశారు. జగన్‌రెడ్డి మాయమాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని, ఎన్నికల్లో విజ్ఞతతో ఓటు వేసి, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని అధికారంలోకి తెచ్చి చంద్రబాబును సీఎం చేయాలని, నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ పంజుగల వెంకయ్య, నక్కా చెన్నారావు, పేరం వెంకటరత్నం, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

మండవల్లి మండలం గన్నవరంలో...

మండవల్లి: మండలంలోని గన్నవరంలో టీడీపీ మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, క్లస్టర్ కూనపురెడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీపై శుక్రవారం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాల కరప త్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలను ప్రజలకు ఈ కార్యక్రమంలో వివరించారు. కలిదిండి మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ చైర్మన్ నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు), నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేరా రమేష్‌బాబు, టీడీపీ క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి సదర్ల సూరి, వీరాబత్తిన సుధా, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పాముల జోసఫ్ తంబి, జిల్లా రజక సాధికార డైరెక్టర్ వీరవల్లి శివయ్య, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ గోల్కొండ చందు, కానుకొల్లు గ్రామ ప్రధాన కార్యదర్శి కోసూరి మాణిక్యాలరావు, గుడివాడ మురళీ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత నాయకుడు చెన్నారావు హఠాన్మరణం


చీకటి చెన్నారావు (ఫైల్)

చాట్రాయి, మార్చి 22: చీపురుగూడేనికి చెందిన నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు చీకటి చెన్నారావు (41) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం ఉదయం చింతలపూడి పట్టణంలో జిమ్‌కు వెళ్లిన ఆయన వ్యాయామం అనంతరం బయటకు వచ్చి బైక్‌కి పెట్రోలు పోయిస్తుండగా గుండె నొప్పి అనిపించటంతో దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం విజయవాడ తీసుకువెళ్తుండగా మృతి చెందారు. చెన్నారావు మృతితో చీపురుగూడెంలోను, మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చెన్నారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చెన్నారావు పార్థివ దేహానికి నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, నియోజకవర్గ నాయకుడు కాపా శ్రీనివాసరావు, అక్కినేని చందు, చిలుకూరి వెంకటేశ్వరరావు, గద్దె రఘుబాబు, టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, లక్ష్మణరావు, జగదీష్, మరిడి చిట్టిబాబు, మంచిన పూర్ణ, దుర్గారావు అన్ని గ్రామాల నాయకులు శ్రద్ధాంజలి ఘటించి ఆయన కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైభవంగా మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు



కలిదిండి, మార్చి 22 : మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఛైర్మన్ తమ్మినీడి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బండి తులసీరావు, బోళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవాలు


పూజలు చేస్తున్న మాజీ మంత్రి కామినేని

కైకలూరు, మార్చి 22: వరహాపట్నంలో లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. గోపూజ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు. స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా అమృతేశ్వరస్వామి గ్రామోత్సవం

ముదినేపల్లి రూరల్, మార్చి 22: మండలంలోని సింగరాయపాలెంలో ఉన్న అమృతేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఊరేగించారు. భక్తులు భారీగా హాజరయ్యారు. ఆలయ ఇన్‌చార్జ్ సింగనపల్లి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చటాకాయ్‌లో తపాలా కార్యాలయం ప్రారంభం

కైకలూరు, మార్చి 22: గ్రామీణ ప్రాంత ప్రజలకు తపాలా శాఖ సేవలు చేరువ చేసేందుకు నూతనంగా బ్రాంచ్ పోస్టాఫీసును ఏర్పాటు చేస్తున్నట్లు గుడివాడ తపాలా శాఖ సూపరింటెండెంట్ బి. అంబేడ్కర్ రాజు అన్నారు. శుక్రవారం కైకలూరు మండలం చటాకాయ్‌లో బ్రాంచ్ పోస్టాఫీసును ఆయన ప్రారంభించారు. అన్ని పోస్టాఫీసుల్లో పథకాలు, బీమా, ఆధార్ సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. కైకలూరు సబ్ డివిజన్ అధికారి ఎ. సురేష్‌కుమార్, పల్లెవాడ సబ్‌పోస్టమాస్టర్ డి. ఆనంద్ వినయ్‌కుమార్, వీవీ సత్యనారాయణ, గణేశ్, వర్మ, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ

కైకలూరు, మార్చి 22: తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీ అయిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు కైకలూరు రూరల్ ఎస్సై టి. రామకృష్ణ తెలిపారు. కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామానికి చెందిన దాట్ల ప్రభావతి అదే గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తోంది. గురువారం రోజువారీలాగే ఇంటికి తాళం వేసి స్కూల్‌కు వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. చోరీ అయినట్టు గుర్తించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వచ్చి పరిశీలించి బీరువాలోని 7 కాసుల బంగారు ఆభరణాలు చోరీ అయినట్టు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ.. పాల్గొన్న అధికారులు

116 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపు

ఆగిరిపల్లి, మార్చి 22: నూజివీడు సబ్ డివిజన్‌లో 116 అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లు గుర్తించామని ఈ ప్రాంతాల్లో సెంట్రల్ ఫోర్స్‌తో కవాతు నిర్వహించి, ఓటర్లలో మనోధైర్యం నింపుతామని నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య తెలిపారు. ఎన్నికల విధివిధానాలపై నూజివీడు డీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాయకులు కోడ్ అమలుకు సహకరించాలని, చెక్‌పోస్టుల వద్ద అత్యవసర తనిఖీలు జరుగుతున్నాయని ఎంసీసీ కేసు పెడితే రాజీకి అవకాశం ఉండదని ముఖ్యంగా విద్యార్థులు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని కోరారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ ఏ ఉద్యోగి అయినా రిటర్నింగ్ అధికారి పరిధిలో పనిచేయాలని, అభ్యర్థులు ప్రచారం, ర్యాలీలు, సమావేశాల నిర్వహణకు ఆర్వో అనుమతి తీసుకోవాలన్నారు. ఎమ్మార్వో మృత్యుంజయరావు, ఎంపీడీవో శామ్యూల్, ఏఎస్సై టవేరియా నాయక్, పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సోమవరంలో సీఆర్పీఎఫ్ బలగాల కవాతు

చాట్రాయి, మార్చి 22: మండలంలో సమస్యాత్మక గ్రామంగా నమోదైన సోమవరంలో శుక్రవారం రాత్రి ఎస్సై కేసీహెచ్ స్వామి ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి ఒత్తిడులకు, ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు వేసి, నిజాయితీగా సేవలు అందించే ప్రజాప్రతినిదులను ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు సామాన్యుడి చేతిలో వజ్రాయుధమని గుర్తించాలన్నారు.



నిష్కళంకమాత ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు

ముసునూరు, మార్చి 22: నెహ్రూ నగర్‌లోని నిష్కళంక మాత ఉత్సవాల రెండోరోజు శుక్రవారం భక్తులు పోటెత్తారు. రమణక్కపేట విచారణ సహాయ గురువులు రెవ.ఫాదర్ రాజశేఖర్ ఆరాధన చేయగా, రెవ. ఫాదర్ జాన్‌భారతి దివ్యబలిపూజ నిర్వహించారు. అనంతరం కృష్ణాజిల్లా కూచిపూడి విచారణ కర్త రెవ.ఫాదర్ పులపాక జాకబ్‌ప్రసాద్ భక్తులకు వాక్యోపదేశాన్ని అందించారు. కాట్రేనిపాడు, ముసునూరు విచారణ ఉపదేశకులు ఆధ్వర్యంలో పరిశుద్ధ శిలువ మార్గాన్ని నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం విజయవాడ పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు ముఖ్య అతిథిగా పాల్గొని దివ్యబలిపూజ నిర్వహించి భక్తులకు సందేశాన్నిచ్చారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ నిర్వాహకులు, ముసునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జోసఫ్ తంబి పర్యవేక్షించారు.

ఎట్టకేలకు తమ్మిలేరు కాజ్‌వేకి రెయిలింగ్స్



చాట్రాయి, మార్చి 22: చాట్రాయి-చింతలపూడి మండలాల మధ్య చిన్నంపేట గ్రామం వద్ద తమ్మిలేరు అసంపూర్తి కాజ్‌వేకి 30 ఏళ్ల తరువాత ఎట్టకేలకు రెయిలింగ్ నిర్మించటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1995లో చిన్నంపేట-శివపురం గ్రామాల మధ్య రెయిలింగ్స్ లేకుండా అసంపూర్తిగా ఈ కాజ్‌వే నిర్మించారు. నిత్యం ఈ కాజ్‌వేపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. రెయిలింగ్ లేక ప్రమాదాలు జరిగి ఇద్దరు చనిపోయారు. దీనిపై ఆంధ్రజ్యోతి పలుమార్లు కథనాలను ప్రచురించింది. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి రూ. 10 లక్షలు మంజూరు చేయటంతో కాజ్‌వేకి రెయిలింగ్స్, అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. దీంతో ప్రజలు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

4 ఏళ్ల తర్వాత ముసునూరు పీహెచ్‌సీలో ప్రసవం



ముసునూరు, మార్చి 22: నాడు-నేడులో పీహెచ్‌సీలో అభివృద్ధి పనులు చేపట్టి, ఆపరేషన్ థియేటర్‌లో చేయాల్సిన పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేయడంతో నాలుగేళ్ళుగా పీహెచ్‌సీలో ఒక్క ప్రసవం కూడా జరగ లేదు. నేటికీ ఈ పనుల గురించి పట్టించుకున్న నాథుడే లేడు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం కూడా ప్రచురించింది. ఈ నేపథ్యంలో నూతనంగా వచ్చిన వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి చొరవతో ఆపరేషన్ థియేటర్‌లో అవసరమైన సామగ్రిని సమకూర్చారు. నాలుగేళ్ల తరువాత శుక్రవారం వైద్యాధికారిణి ముసునూరుకు చెందిన కల్యాణి అనే గర్భిణికి పీహెచ్‌సీలో సుఖ ప్రసవం చేశారు. తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉన్నారు. సాధ్యమైనంత వరకు పీహెచ్‌సీలోనే ప్రసవాలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేసుకున్నామని, అత్యవసరమైతేనే నూజివీడు ఏరియా ఆసుపత్రికి పంపుతామని ఇవాంజలి తెలిపారు. వైద్యాధికారిణి చొరవతో మరలా ఆసుపత్రిలో ప్రసవాలు జరపడంతో పలువురు వైద్యుల పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్యకర్తకు పార్థసారథి ఆర్థిక సాయం



ఆగిరిపల్లి, మార్చి 22: ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త మోదు కోటేశ్వరరావును నూజివీడు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కోటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యాడని తెలుసుకున్న పార్థసారథి ఆయనను పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు.

'పుట్టా' ఎంపికపై హర్షం

ముదినేపల్లి రూరల్, మార్చి 22: టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన పుట్టా మహేష్ యాదవ్‌కు టిక్కెట్ కేటాయించటం హర్షణీయమని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు దావు నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌లు బీసీ వర్గానికి చెందిన అభ్యర్థిని నిలబెట్టి బీసీలపై తమ ప్రేమను చాటుకున్నారని ప్రశంసించారు.

చిన్నంపేటలో 'సురక్ష' వైద్య శిబిరం

చాట్రాయి, మార్చి 22: చిన్నంపేటలో శుక్రవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరంలో 365 మందికి ఉచిత వైద్యసేవలు అందించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు ఎం. సంఘమిత్ర (జనరల్ మెడిసిన్), పీహెచ్ ప్రవీణ్ చౌదరి (పీడియాట్రిక్), పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసుల రెడ్డి, దుర్గాప్రసాద్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో మంగాకుమారి, ఈవోపీఆర్డీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ముదినేపల్లి హైస్కూల్‌లో లెక్కల పరీక్షకు వస్తున్న విద్యార్థులు


కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

గణితం.. ప్రశాంతం

టెన్త్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు


ముసునూరు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

ముసునూరు, మార్చి 22: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం లెక్కల పరీక్షకు 61 మంది విద్యార్థులు గైర్హాజరైయ్యారు. చెక్కపల్లి జడ్పీ పాఠశాల పరీక్షా కేంద్రంలో 292 మంది గాను 262మంది హాజరయ్యారు. గోపవరం పరీక్షా కేంద్రంలో 185 మందికి 165 మంది హాజరు కాగా ముసునూరు కేంద్రంలో 219 మందికి 208 మంది హాజరయ్యారు. తహసీల్దార్ జవహర్ బాజి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎస్ఐ పి.వాసు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నూజివీడు టౌన్: 10వ తరగతి గణిత పరీక్షల్లో నూజివీడు డివిజన్‌లో పరిధిలో 322 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు నూజివీడు డీవైఈవో సేవ్యా తెలిపారు. శుక్రవారం గణిత పరీక్షకు మొత్తం 17 పరీక్షా కేంద్రాల్లో 3,857 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 3535 మంది హాజరయ్యారు.

ఆగిరిపల్లి: శుక్రవారం నిర్వహించిన గణిత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆగిరిపల్లి మూడు పరీక్షా కేంద్రాల్లో హాజరు కావాల్సిన 594 మంది విద్యార్థుల్లో ఆరుగురు గైర్హాజరు అయ్యారు. జడ్పీ హైస్కూల్ నందు 210మంది విద్యార్థులకు 207మంది, ఎస్.వి పబ్లిక్‌స్కూల్ నందు 210మంది విద్యార్థులకు 208మంది, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌నందు 174మంది విద్యార్థులకు 173మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో సర్వేశ్వరరావు తెలిపారు. ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్‌ను డీఈవో అబ్రహం తనిఖీ చేసినట్టు హెచ్‌ఎం పుష్పలత తెలిపారు.

చాట్రాయి: చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 29 మంది, ఆర్సీఎం పరీక్షా కేంద్రంలో 23 మంది మొత్తం 52 మంది శుక్రవారం టెన్త్ పరీక్షలకు గైర్హాజరైనట్టు ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. జడ్పీహైస్కూల్ పరీక్షా కేంద్రంలో 256 మందికి 227 మంది, ఆర్సీయం పరీక్షా కేంద్రంలో 183 మందికి 160 మంది పరీక్షలు రాసినట్లు ఎంఈవో వివరించారు.

కలిదిండి: మండలంలో పది పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం లెక్కల పరీక్షకు 1135 మంది విద్యార్థులకు గానూ 1049 మంది విద్యార్థులు హాజరుకాగా, 86 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. ఎస్ఐ ప్రియకుమార్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ముదినేపల్లి: మండలంలో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం జరిగిన లెక్కల పరీక్షకు 824 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 92 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో నలుగురు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడుగురు, సహాయ మాత హైస్కూల్‌లో 40 మంది, పెదగొన్నూరు హైస్కూల్‌లో రెగ్యులర్ విద్యార్థులు ఐదుగురు, ప్రైవేట్ విద్యార్థులు 36 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. ముదినేపల్లి తహసీల్దార్ నరస లక్ష్మీకుమారితోపాటు ఏలూరు ఎంఈవో రంగయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక స్క్వాడ్ బృందం పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసింది.